# సాధారణ సర్వ సభ్య సమావేశపు నోటీసు

విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశము, ఎజెండాలో పొందుపరచిన అంశములను చర్చించుటకుగాను ది.**02-03-2006** గురువారము ఉదయం : **10.30** గంటలకు విజయవాడ నగరపాలక సంస్థ సభా హాలు నందు జరుగును. కావున సభ్యులందరు హాజరు కాగోరుచున్నాను.

నగరపాలక సంస్థ కార్యాలయము,<br>విజయవాడ, తేది: **21-02-2006.**

సెక్రటరీ ఇన్‌ఛార్జి,<br>విజయవాడ నగరపాలక సంస్థ.

## ఎ జెం డా

**1/853-** ది.30.01.2006 సోమవారము ఉదయం గం.10.30 ని.లకు మరియు ది.31.01.2006 మంగళవారం ఉదయం 11.00 గంటలకు జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశపు తీర్మానములను ధృవపర్చుట గురించి.

**2/854-** విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ చట్టములోని **122**వ సెక్షన్ ననుసరించి వార్డు మెంబర్లచే వేయబడిన ప్రశ్నలు

3/855- విజయవాడ నగరపాలక సంస్థ నందు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసరుగా పనిచేయుచున్న శ్రీ పి.నిర్మల్, ది.31.12.2005న సూపర్‌యాన్యుయేషన్‌పై పదవీ విరమణ చేసినందున సదరు పోస్టు ది.1.1.2006 నుండి ఖాళీగా ఉన్నది.

సదరు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసరు పోస్టును నగరపాలక సంస్థ నందలి ఉన్నత పాఠశాలల్లో పనిచేయుచున్న ప్రధానోపాధ్యాయుల ప్యానల్ లిస్టులోని సీనియర్‌చే పూరించవలసియున్నది.

విజయవాడ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో పనిచేయుచున్న ప్రధానోపాధ్యాయుల ప్యానల్ లిస్టులో శ్రీ యస్.మార్క్, పి.యస్.యం. హై స్కూలులో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేయుచున్నందున సదరు యస్.మార్క్‌ను పదోన్నతిపై, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసరుగా నియమించు విషయములో కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు సూచన చదవటమైనది.(ఆర్.సి.సి1-42802/2005)

శ్రీ దోనేపూడి శంకర్, 49వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

4/856- నగరపాలక సంస్థలో 20 సంవత్సరముల సర్వీసు కలిగిన పబ్లిక్ హెల్త్ వర్కర్లను వర్క్ ఎడ్జస్ట్‌మెంటు మేస్త్రీలుగా నియమించియున్నారు. 3 సంవత్సరాలుగా మేస్త్రీలుగా కొనసాగుచున్నారు. సదరు డివిజన్ల యందు మేస్త్రీల ఆవశ్యకత యున్నది.

సదరు మేస్త్రీలను రెగ్యులర్ మేస్త్రీలుగా నియమించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

5/857- 49వ డివిజన్ రాజరాజేశ్వరి పేటలో నూర్ మహమ్మద్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల చుట్టూ గల నగరపాలక సంస్థ స్థలము అన్యాక్రాంతమయి ఆక్రమణలకు గురి అగుచున్నది. తక్షణమే ఉర్దూ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతములలో గల కార్పోరేషన్ స్థలాన్ని స్వాధీనం చేసుకొని, పాఠశాల చుట్టూ ప్రహరీని నిర్మించవలసినదిగా కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

6/858- వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు (జిల్లా) విజయవాడ నగరపాలక సంస్థ పాఠశాలలకు ట్రాన్స్‌ఫర్‌లపై వచ్చు నిమిత్తము గవర్నమెంటు నుండి మరియు వ్యక్తిగతముగా దరఖాస్తులు (అప్లికేషన్‌లు) వచ్చియున్నాయి. మన నగరపాలక సంస్థ పాఠశాలల యందు టీచర్ల ఖాళీలు ఎక్కువగా వున్నందున వారిని తీసుకొనుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా (ప్రభుత్వం వారి అనుమతి సిఫార్సు లేఖలు లేకపోయినా) కోరుచూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

7/859- నగరములో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందిలో కొంత మంది మహిళలు, పురుషులు దోమలు నిర్మూలించే యమ్.యల్.ఆయిల్ కాలువలో స్ప్రేతో కొట్టడం వలన గాలి ద్వారా ఆ మందు వారి ఊపిరితిత్తులలో చేరి ముందుచూపులో వారికి ఊపిరితిత్తులు చెడిపోయే ప్రమాదం ఉన్నది. కనుక వారికి ఫేస్ మాస్కులు, హ్యాండ్ గ్లౌసెస్, అలాగే శరీరం కప్పబడుటకు ప్రొటక్షన్ (రక్షణ కవచం) క్లాత్ ఇవ్వవలసినదిగాను క్రిమి సంహారమందులు చల్లే సిబ్బందికి ఒక్క రోజుకు రూ.150/-లు రోజువారి వేతనముగా ఇవ్వవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ కాశీనాధ్ దోనేపూడి, 23వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

8/860- విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన గాంధీజీ మునిసిపల్ హై స్కూల్ బిల్డింగ్ పైఅంతస్తులో నిర్వహించబడుతున్న గాంధీ మహిళా కళాశాలకు చెందిన లీజును రద్దు పర్చాల్సిందిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

9/861- మనిషి జీవనానికి ప్రాణాధారమైనది "నీరు" దానిని నిల్వ చేసి పొదుపు చేయవలసిన అవసరము ప్రజల అందరిమేద ఉంది. నేడు పట్టణాలలో నిర్మించేటటువంటి బహుళ అంతస్థుల భవనాలకు నీరు ఎక్కువ అవసరం అవుతుంది. కాబట్టి వర్షాకాలములో కురిసిన వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోవుటకు ప్రతి అపార్టుమెంటులో కొంత భాగము స్థలాన్ని ఇంకుడు గుంటకు ఏర్పాటు చేయవలసినదిగాను ఇంకుడు గుంట ఏర్పాటు చేసిన వారికి మాత్రమే అపార్టుమెంటుల పర్మిషన్‌ను ఇచ్చే విధముగా కౌన్సిల్‌లో తీర్మానం చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ దోనేపూడి శంకర్, 49వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

10/862-విజయవాడ నగరములో భారీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్టుమెంటులు నిర్మాణ సమయములో అగ్నిమాపక శాఖ ఇచ్చే నిబంధనలను, ఇతర నగర ప్రణాళికా నిబంధనలను సక్రమంగా అమలు జరిపే విధముగా చర్యలు తీసుకోవాలని కమీషనరు గారిని కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

11/863-విజయవాడ నగరములో ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన కొందరు మహిళలు, బాలికలు వివిధ సందర్భాలలో కుటుంబ కలహాల వలన, ఆర్ధిక సమస్యల వలన తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం వలన ఆత్మహత్యలకు పాలగుచున్నారు. ఒక్కోసారి స్వల్ప కారణాలే ఆత్మహత్యలకు కారణమతువుతున్నాయంటే ఆశ్చర్యము కలుగుతుంది. ఇటువంటి ఆత్మహత్యల వలన ఆయా కుటుంబాలు తెగిన గాలిపటాల్లాగా చెల్లా చెదురవుతున్నాయి. వీటిని తగ్గించేందుకు నగరపాలక సంస్థ కొన్ని ప్రయత్నాలను చేయవల్సిన అవసరముంది. పట్టణ సామాజిక అభివృద్ధి విభాగము (యు.సి.డి.) ద్వారా నగరములోని అన్ని సర్కిల్స్ మరియు ప్రధాన కార్యాలయాలలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేసి కుటుంబ సమస్యలతో బాధపడేవారికి కౌన్సిలింగ్ ఇప్పించి అత్మహత్యల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నం చేయాలని కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి మల్లిక బేగం, 40వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

12/864-కె.జి.మార్కెట్టు నందు నూతనముగా నిర్మించిన కాంప్లెక్స్‌లో ఫ్లాట్ ఫారాలను లాటరీ పద్ధతిలో కేటాయించినారు. మొదటి అంతస్తులో ఫ్లాట్ ఫారం నెం.11,19,22,30,93,96,102,105 గల వారికి, రెండవ అంతస్థులో 4,30,28,19,105,99,96,93,91,84,85 ఫ్లాట్ ఫారమ్స్

వారికి పిల్లర్లు అడ్డు వచ్చినవి. గతములో వీరి పరిస్థితిపై కౌన్సిల్ నందు చర్చ జరిగిననూ వీరికి న్యాయం జరగలేదు.

పై వ్యాపారులు నష్టపడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను. (2004 సంవత్సరం సబ్-కమిటీలో 17 / 26లో రిమార్కులు తీసుకున్నను తీర్మానము అమలు పర్చలేదు. వీరికి ప్రత్యామ్నాయముగా షాపు బ్లాకుల గోడల వైపు వ్యాపారం చేసుకొనుటకు అవకాశం ఇప్పించగలరు)

శ్రీ ఎరుబోతు రమణారావు, 52వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

13/865- గత తెలుగుదేశం ప్రభుత్వము అధికారములో వుండగా బడుగు, బలహీన వర్గం మరియు మహిళా క్షేమము కొరకు ప్రజల వద్దకు నేరుగా పరిపాలన అందించే విధముగా, ఆనాడు జన్మభూమి, గ్రామసభ పెట్టడం జరిగినది. కానీ ఈ ప్రభుత్వము అధికారములోకి వచ్చిన తరువాత రద్దు చేసినారు. దాని వలన ప్రజలు అధికారులను ప్రజా ప్రతినిధులను కలవాలంటే ఎన్నోసార్లు కార్యాలయముల చుట్టూ ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరగాల్సివస్తుంది. దాని వలన అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయినది. ఈ ప్రభుత్వం జన్మభూమి, గ్రామ సభలు తిరిగి పెట్టవలసినదిగా మన కౌన్సిల్ ద్వారా రాష్ట్ర పభుత్వాన్ని కోరవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ కాశీనాథ్ దోనేపూడి, 23వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు:-

**14/866**-పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం ప్రతి డివిజన్‌కు అదనముగా పుష్ కార్ట్స్ (తోపుడు బండ్లు) మరియు ట్రై-సైకిల్స్ అందజేసేందుకు ఒక్కో డివిజన్‌కు రెండేసి ఆటోలు (శానిటేషన్ నిమిత్తం) చొప్పున ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

ప్రస్తుం వున్న 'చెత్త' తీసుకెళ్ళే వాహనాలు మెయిన్ బజార్లు, పెద్ద రోడ్లకు వెళ్ళే వీలుంది. చిన్న చిన్న రోడ్లున్న ప్రాంతాలకు తప్పనిసరిగా పారిశుద్ధ్య నిర్వహణకు ఆటో ఉపయోగిస్తే పారిశుద్ధ్యం మెరుగౌతుంది. కావున ఒక్కో డివిజన్‌కు రెండేసి ఆటోలు కూడా (ప్రస్తుతం వున్న పెద్ద వాహనాలకు తోడుగా) కేటాయించాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**15/867**-నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రసూతి వైద్యశాలలు, హోమియో, ఆయుర్వేద, యునాని వైద్యశాలలు సక్రమ నిర్వహణకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**16/868**-విజయవాడ నగరపాలక సంస్థకు రైల్వే శాఖ నుండి రావాల్సిన సర్వీస్ ఛార్జీలు బకాయిలతో సహా రాబట్టేందుకు చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**17/869**-**23**వ డివిజన్ పరిధిలో నున్న తారక రామానగర్ ప్రాంతంలో గుర్రపుడెక్క తూటుకాడ పెరిగిపోయి స్థానిక ప్రజలు పలు యిక్కట్లకు లోనౌతున్నారు. మురుగునీరు నదిలో 'పాయ'గా ఏర్పడి దుర్గంధంతో ప్రజలు నివసించలేని స్థితి ఏర్పడుతోంది. మురుగునీరు ఒకచోట స్తంభించిపోయి (ప్రవాహం లేకుండా) ప్రక్కనే నివాసులు ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. తక్షణం దుర్గంధం రాకుండా చర్యలు చేపట్టడం అవసరం. అదే విధంగా గుర్రపు డెక్క, మురుగునీరు నిల్వ వుండకుండా తక్షణ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నాను.

**18/870**-రానున్న వేసవిని గమనంలోకి తీసుకొని నగరంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**19/871**- కౌన్సిల్ తీర్మానం ప్రకారం రానున్న వేసవిలోనైనా బోర్లు, ట్యాప్‌లు వేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**20/872**– ఓ.డి.ఎ. అమలు సందర్భంలో కొనుగోలు చేసిన వస్తువులు, పరికరములు, వాహనములు అనగా టూల్స్ అండ్ ప్లాంట్స్ (T & P) రిజిష్టర్ సక్రమ నిర్వహణకు, వాటిని ప్రజోపయోగానికై వినియోగించేందుకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**21/873**– నగరపాలక సంస్థలోని మేయరు, కార్పొరేటర్లు, కో–ఆప్టెడ్ మెంబర్లు ప్రతి సంవత్సరం చివరిలో తమ ఆస్తుల వివరాలు స్వచ్ఛంధంగా కౌన్సిల్‌కు తెలియపర్చేందుకు వాటి వివరాలను బహిరంగంగా ప్రకటించేందుకు మార్గదర్శక సూత్రాలు రూపొందించుటకు ప్రతిపాదించడమైనది.

**22/874**– దోమల నిర్మూలనకు హ్యాండ్ ఫాగ్ (ఫాగింగ్ మెషీన్లు) కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**23/875**– అక్టోబరు 27వ తేదీ 2005వ సంవత్సరంతో మొదలైన మొదటి కౌన్సిల్ నుండి జనవరి 31, 2006 వరకు జరిగిన కౌన్సిల్ సమావేశ తీర్మానాలకు సంబంధించి వాటి అమలుకు సక్రమ చర్యలను తీసుకోవాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**24/876**– రానున్న వేసవి కాలం డ్రైయిన్ పూడికతీతకు అనువైన సమయం కాబట్టి నగరంలోని ఓపెన్ డ్రైయిన్స్ అన్నింటిలో పూడిక తీసేందుకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

**25/877**– నగరంలో ఇంద్రకీలాద్రిపై వున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించు భక్తులు నిత్యం వేలాది మంది వస్తున్నారు. ఇందుకవసరమైన పౌర సదుపాయములు వివిధ సందర్భాలతోపాటు ప్రతి రోజూ కల్పించాల్సిన అవసరం వుంది. ఆ విధంగా కల్పించడం బాధ్యత కూడా. అయితే నగరాభివృద్ధికి ప్రస్తుత కార్పొరేషన్ ఆర్థిక స్థితిరీత్యా దేవస్థానానికొచ్చే ఆదాయంలో 25 శాతం చెల్లించేందుకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా దేవాదాయ శాఖను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదించడమైనది.

<u>శ్రీ బి.హెచ్.ఎస్.వి.జానారెడ్డి, 56వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు</u>

26/878- 56వ డివిజన్ పాత పాయకాపురం మెయిన్ రోడ్డు నుండి అడపాల పోతురాజు గారి ఇంటి వరకు పైపు లైను అప్పటి అవసరాల అనుగుణంగా 4" అంగుళాలు పైపు వేసియున్నారు. కావున దీనిని మార్చి 6" అంగుళాలు పైపును వేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

27/879- 56వ డివిజన్ దేవినేని గాంధీపురం నందు సగం వరకు సి.సి.రోడ్డు కలదు. దీనిని "యానాదుల" ఇళ్ళ వరకు పొడిగించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను. దీనిని రెవిన్యూ పోరంబోకుగా కమీషనరు గారు అభ్యంతరం చెప్పుచున్నారు. కాని వారు ఇంటి పన్ను, ఇతరత్రా కార్పోరేషన్ వారికి పన్నులు చెల్లించుచున్నారు. మన కార్పోరేషన్ వారు గతములో పైన పేర్కొన్న ఇళ్ళ వరకు వాటర్ పైపు లైను, విద్యుత్ లైను కూడా వేసియున్నారు. కావున రోడ్డుని కూడా పొడిగించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

28/880- 56వ డివిజన్ వాంబేకాలనీ నందు చిరు వ్యాపారులు, బడ్డీలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగించుచున్నారు. కాని అవి రోడ్డుకు ప్రక్కగాను, మురుగు కాల్వల మీదనూ ఉండుట వలన కార్పోరేషన్ సిబ్బంది విధులకు అటంకముగా ఉన్నవని, మన కార్పోరేషన్ వారు పలు దఫాలుగా తొలగించటం, తిరిగి వారు ఏర్పాటు చేయడం జరుగుచున్నది. కావున దీనిని శాశ్వత పరిష్కారముగా "షాపింగ్ కాంప్లెక్స్" త్వరితగతిన నిర్మించవలసినదిగా కోరుచున్నాను.

శ్రీమతి కాజా సరోజ, 19వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

29/881- 19వ డివిజన్ కస్తూరిభాయి పేట బెల్లపు వెంకట్రాది వీధిలో షెడ్యూల్డు కులాల బాలికల హాస్టల్ మరియు వికలాంగుల బాలికలు, బాలుర హాస్టల్ ఉన్నది. ఈ వీధి రోడ్డు పూర్తిగా పాడైనది. వికలాంగుల బాల, బాలికలు అత్యవసర పనిపై నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున అత్యవసరముగా ఈ రోడ్డు సిమెంట్ రోడ్డు నిర్మాణము చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

30/882-రామలింగేశ్వర నగర్‌లోని రజిత్ భార్గవ రోడ్డు (స్మశానము రోడ్డు) 80 అడుగుల రోడ్డు ఉన్నందువలన కార్పోరేషన్ వారు వేసిన మాములు ట్యూబులైట్లు కాంతి సరిపోవుట లేదు. అందుచేత ఆ రోడ్డు పొడవున యస్.వి.ల్యాంప్స్ వేయగలరని ప్రతిపాదించుచున్నాను.

31/883- 14వ డివిజన్‌లోని స్క్యూ బ్రిడ్జి దగ్గర పబ్లిక్ టాయిలెట్స్ (సులభా కాంప్లెక్స్) నిర్మించగలరు. యన్.హెచ్. నెం.5లో, 6వ టౌన్ పోలీస్ స్టేషన్‌కు దగ్గరలో మాత్రమే ఉన్నది. అక్కడి నుండి బెంజి సర్కిల్ వరకు మధ్యలో ఎక్కడా లేనందువలన ప్రజల అవసరము దృష్ట్యా స్క్యూ బ్రిడ్జి దగ్గర (రామలింగేశ్వర నగర్ ముఖ ద్వారము దగ్గరలో) సులభా కాంప్లెక్స్ నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి వీర్ల వరలక్ష్మి, 57వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

32/884- 57వ డివిజన్‌లో నివసించువారు అందరు కడు పేదవారు. ఇక్కడ అనగా ప్రకాష్‌నగర్ సెంటరుకు నాలుగు మూలలందు చాలా మాంస దుకాణములు, కూరల దుకాణములు ఇతర చిరు వ్యాపారులు అనేక మంది జీవనము సాగించుచున్నారు.

ప్రతి రోజు సుమారు రెండు వేల ఆటోలు, ట్రిప్పర్లు, సుమారు నూరు సిటీ బస్ ట్రిప్పులు జరుగుతూ ఉంటాయి. మరియు ఈ నూజివీడు రోడ్డుకు రెండు వైపుల ఓపెన్ డ్రైన్ ఉన్నది. ఈ డ్రైను చాలా దుర్గంధము వెదజల్లుతూ వచ్చే వారికి, వెళ్ళే వారికి వ్యాపారస్తులకు అందరికి చాలా ఇబ్బందికరముగా ఉన్నది. పైగా ఇక్కడి మాంస దుకాణములు అన్నియు రోడ్డు మీదే ఉండుట వలన సదరు దుకాణముల నుండి ఈగలు, దుర్గంధము సదరు ఓపైన్ డ్రైనేజి నుండి వచ్చే దర్గంధము కలసి ప్రజలను చాలా ఇబ్బందులు పెట్టుచున్నది.

మరియు ఇది ప్రజల రవాణాకు ప్రధాన కూడలి అయిన సిటీ బస్ స్టాండు కూడా ఇక్కడనే ఉన్నది. ఉదయం నుండి సాయంత్రం వరకు అనేక మంది ప్రజలు నగరంలోనికి వచ్చి పోతూఉంటారు.

ఇక్కడ మాంస దుకాణములు ఒపెన్‌గా ఉంచుట వలన ప్రజలందరు తీవ్ర అసౌకర్యమునకు లోనౌతున్నారు. ఈగలు ముసురుకుని బస్ స్టాండులో ప్రజలు నుంచోటానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. స్కూలుకు, కాలేజీలకు వెళ్లే పిల్లలు కూడా ఇక్కడ అధికము వారందరు ఓపెన్‌గా మాంసం, కోళ్ళు వగైరా అమ్ముట వలన చాలా అసౌకర్యముతో బాధ పడుతున్నారు.

ఈ వ్యాపారులందరు చిరు వ్యాపారులు. మాంసం అమ్మకమును వ్యతిరేకించుట వలన చాలా మంది ఆర్థికముగా నష్ట పోయి చితికిపోతారు. కనుక తమరు దయచేసి పై విషయములు అన్నియు పరిశీలించి అన్ని వర్గములకు అనుకూలముగా తగు నిర్ణయం తీసుకోవలసినదిగా కోరుచున్నాను. మరియు దీనికి పరిష్కారముగా ఎ.వి.ఎస్.రోడ్డు మరియు నూజివీడు రోడ్డు మధ్యలో గల కార్పోరేషను వారి స్థలమందు దుకాణ సముదాయము నిర్మించినచో అటు

వ్యాపారస్తులకు కార్పోరేషనుకు ఆదాయము శాశ్వతముగా ఉండును. మరియు ప్రజలు ఆనార్యోగ్యము నుండి బయట పడుదురు. ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరును.

అందువలన తమరు పై విషయములు అన్నియు పరిగణలోనికి తీసుకుని సకాలములో సరైన నిర్ణయమును తీసుకోవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

33/885-కౌన్సిల్ ఆమోదించిన వార్డు బడ్జెట్ కొనసాగించవలసినదిగాను, వార్డు బడ్జెట్ పనులను చేపట్టవలసినదిగాను ప్రతిపాదించుచున్నాను.

34/886- 55వ వార్డు శాంతినగర్ మరియు అజీత్‌సింగ్ నగర్ ఏరియాలలో రీడింగ్ రూముల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

35/887-ఆస్తి పన్ను కనీసం రూ.140లు (6 నెలలకు) కు తగ్గకుండా ఉండాలనే పద్ధతిని విడనాడి హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ చట్టము మరియు నగరపాలక సంస్థ నిర్ణయించిన అద్దె విలువ ఆధారముగా ఆస్తి పన్ను విధించుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ మురపాల సత్యవతి, 58వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

36/888- 58వ డివిజన్ విశాలాంధ్ర కాలనీలో సైడు డ్రైయిన్లు లేకపోవడం వలన మురుగు నీరు ప్రవహించక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున వెంటనే సైడు డ్రైయిన్లు నిర్మాణము చేపట్టవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

37/889- 58వ డివిజన్ విశాలాంధ్ర కాలనీలో డోరు నెంబర్లు లేకపోవడం వలన వివిధ సంక్షేమ పథకాలకి అవసరమైన సర్టిఫికెట్స్ పొందడానికి, మరియు ప్రజా అవసరాలకు అడ్రస్సు వివరాలు కావాల్సిన సందర్భములో పలు ఇబ్బందులకు గురి అవుచున్నారు. కావున వెంటనే డోరు నెంబర్లు ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీమతి కొప్పరపు శ్రీదేవి, 59వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

38/890- 59వ డివిజన్‌లోని ఈ క్రింద పేర్కొన్న ఫెన్సింగ్ వేసిన కార్పోరేషన్ ఖాళీ స్థలములో ప్రహారీ గోడ నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

1. ప్రజాశక్తి నగర్‌లోని డోరు నెం.77-99-13 వద్ద,
2. ప్రజాశక్తి నగర్‌లోని డోరు నెం.77-103-7 వద్ద.

39/891- 59వ డివిజన్‌లోని కుందా వారి కండ్రిక గ్రామములోని యు.పి.స్కూల్‌ని కార్పోరేషన్‌లో కలిపి అభివృద్ధి చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

40/892- 59వ డివిజన్‌లోని కుందా వారి కండ్రిక గ్రామములో అంగన్ వాడీ సెంటర్‌ను ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

41/893- యన్.యస్.సి.బోస్ నగర్‌లోని బి.వి.సుబ్బారెడ్డి హై స్కూల్ చుట్టూ ప్రహారీ గోడ 4 అడుగుల మేర ఎత్తు పెంచి, నేమ్ బోర్డుని ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ డి.వి.రమణబాబు, 31వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

42/894- విజయవాడ నగరపాలక సంస్థలో పేద, మధ్య తరగతి ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందజేయాల్సిన అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ యు.సి.డి. విభాగం పలు ఆరోపణలకు నిలయముగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న ప్రాజెక్టు ఆఫీసర్ అజయ్‌కుమార్‌పై అనేక ఆరోపణలు వచ్చినప్పటికి, వివిధ సందర్భాలలో కౌన్సిల్‌లో కార్పొరేటర్లు తమ అభ్యంతరాలను వ్యక్తం చేసి పనితీరు మార్చుకోవాలని సూచించినప్పటికి ఎటువంటి మార్పు లేదు. ఆయన వ్యవహార శైలి వల్ల వృద్ధులు, మహిళలు, వితంతువులు, వికలాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధముగా ఆయన చేస్తున్న పనులపై దాదాపు అన్ని పత్రికల్లో చిలువలు పలువలుగా వార్తలు వెలువడ్డాయి. అయినా ఆయనలో ఎటువంటి మార్పు లేదు. లబ్దిదారులపై తన వేధింపులను, నిబంధనల ఉల్లంఘనను అదే విధముగా కొనసాగిస్తున్నారు. ఆయన పనితీరు కార్పొరేషన్ ప్రతిష్టకి నష్టం కలిగించేదిగా ఉంది. అందువల్ల ఆయన సేవలు నగరపాలక సంస్థకి ఇక అవసరం లేదని, తక్షణమే ఆయనను తన మాతృసంస్థకి సరెండర్ చేయాలని కమీషనర్‌ని ఆదేశించాలని కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీ అబ్దుల్ ఖాదర్, 27వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన

43/895- 27వ డివిజన్ ప్రజలు వినియోగించుకొను క్రిస్టియన్ సోదరులకు సంబంధించి (Burrial Ground) స్మశానవాటిక నందు ఒక షెడ్డు, మరియు రెండు కరెంటు స్థంభములు క్రొత్తవి, మరియు లైట్లు ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి పిల్లి లక్ష్మి తులసి, 45వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

44/896- 45వ డివిజన్ మధురానగర్‌లో రైల్వే గేటు వద్ద బ్రిడ్జి శాంక్షన్ అయినందు వలన త్వరలో బ్రిడ్జి పనులు మొదలు అయ్యే అవకాశం ఉన్నందున స్థానికులకు, రైల్వే ప్రయాణికులకు నగరములోనికి వచ్చి వెళ్ళుటకు మరో ముఖ్యమైన రోడ్డు పార్కు రోడ్డు అవ్వటం వలన భవిష్యత్‌లో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా పార్కు రోడ్డులోని ఆక్రమణలు తొలగించి ఆ రోడ్డును మెటల్ రోడ్డుగా నిర్మించవలసినదిగా ప్రతిపాదిస్తున్నాను.

45/897- 45వ డివిజన్ మధురానగర్‌లో మునిసిపల్ కార్పోరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ నందు టాయిలెట్స్ లేకపోవటం వలన లీజుదారులు మరియు కొనుగోలుదారులు ఇబ్బంది పతుతున్నారు. మున్సిపల్ కార్పోరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ నందు టాయిలెట్స్ నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

46/898- 45వ డివిజన్ మధురానగర్‌లో రాగం మస్తాన్‌రావు రోడ్డులోని, డోరు నెం.21-11/15/11, శ్రవణం రాంబాబు ఇంటి స్థలములో గతములో డ్రైన్‌లు నిర్మించటమైనది. గతములో వారి స్థలం ముందు స్లూయిస్ వాల్‌ఫిట్ వుండుట వలన డ్రైన్‌ను వారి స్వంత స్థలం నుండి త్రిప్పుట జరిగినది. డ్రైన్ వారి ఇంటి స్థలములో ఉండుట వలన ఇంటి గోడ దెబ్బతిన్నది. ప్రస్తుతం వాల్‌పిట్ తిసివేసినందున ఉన్న డ్రైన్‌ను తిన్నగా సరిచేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

47/899- 45వ డివిజన్ మధురానగర్‌లో నేతాజీ రోడ్డులోని గౌతమ విద్యానికేతన్ వెనుక ఉన్న సిమెంట్ రోడ్డులో రెండు సంవత్సరాల క్రితం పైపు కనెక్షన్ కోసం రోడ్డును పగల కొట్టారు. పైపులు నిర్మించారు. సదరు గోతులను పూడ్చి రోడ్డును నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

48/900- 45వ డివిజన్ మధురానగర్‌లో ది సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ (జి.ఓ.నెం.2423) ద్వారా ప్లాట్లు కొని ఇళ్ళు నిర్మించుకున్నారు. సొసైటీ కాలనీలో నాలుగు రోడ్లు ఉన్నాయి. ఆ కాలనీకి రైల్వే సొసైటి కాలనీ అని నాలుగు వీధులకు రైల్వే కాలనీ నెం.1, 2, 3, 4 రోడ్లుగా పేర్లు పెట్టవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

49/901- 45వ డివిజన్ మధురానగర్‌లో పసుపుతోట నాలుగో లైన్‌లో సైడ్ డ్రైన్స్ లేనందు వలన సైడ్ డ్రైన్స్ నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

50/902- 45వ డివిజన్ మధురానగర్‌లో పసుపుతోట, రెండవ లైన్‌లో సైడ్ డ్రైన్స్ లేనందువలన సైడ్ డ్రైన్స్ నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

51/903- 45వ డివిజన్ మధురానగర్‌లో పసుపుతోట మూడవలైన్‌లో సైడ్ డ్రైన్స్ లేవు. కనీసం కచ్చా డ్రైన్స్ లేనందున ఇళ్ళలలో వాడిన నీరు బయటకు వెళ్ళే మార్గం లేక వారి వారి ఇళ్ళ ముందు గోతులు త్రవ్వుకున్నారు. ఆ గోతుల నిండా మురుగునీరు నిండి పొంగి పొర్లి రోడ్లమీదకు పారుతూ ఉండుట వలన దోమలు వృద్ధిచెంది ప్రజలు పలు రోగాలకు గురవుతున్నారు. కావున పసుపుతోట మూడవ లైన్‌లో సైడ్ డ్రైన్స్ నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

52/904- 45వ డివిజన్ మధురానగర్‌లో పసుపుతోట ఫస్ట్ లైన్‌లొ సైడ్ డ్రైన్స్ లేవు. కనీసం కచ్చా డ్రైన్స్ లేనందున ఇళ్ళలలో వాడిన నీరు బయటకు వెళ్ళే మార్గం లేక వారి వారి ఇళ్ళ ముందు గోతులు త్రవ్వుకున్నారు. ఆ గోతుల నిండా మురుగునీరు నిండి పొంగి పొర్లి రోడ్లమీదకు పారుతూ ఉండుట వలన దోమలు వృద్ధిచెంది ప్రజలు పలురోగాలకు గురవుతున్నారు. కావున పసుపుతోట ఫస్ట్ లైన్‌లో సైడ్ డ్రైన్స్ నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

53/905- 45వ డివిజన్ మధురానగర్‌లో మునిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కలదు. ఈ కాంప్లెక్స్‌లో వెనుక ముందు కలసి 24 షాపులు ఉన్నాయి. ఈ షాపులలో చిన్న చిన్న వ్యాపారులు వ్యాపారం చేసుకొంటున్నారు. షాపుల ముందు ఎత్తైన ప్రహరీగోడలు ఉండుట వలన ప్రజలకు అక్కడ షాపులున్నాయని తెలియక వ్యాపారాలు జరగటం లేదు. కావున షాపులు బయటకు కనిపించేటట్లు షాపు ముందున్న ప్రహరీ గోడను తొలగించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీ అబ్దుల్ ఖాదర్, 27వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన</u>

54/906- నగరములో దాదాపుగా 90 వేల రేషన్ కార్డులు రీ-సర్వే పేరుతో నకిలీవి కూడా ఉన్నవనే ఆలోచనతో నిలిపివేసి వారికి రేషన్ కూడా ఈ నెల రద్దు చేయటం జరిగినది. ముఖ్యముగా 27 వ డివిజన్‌లో దాదాపుగా 4 వేల రేషన్ కార్డులు పేదల బస్తీలకు చెందిన కార్డులని 90 శాతము నిలిపివేయటం జరిగినది. ప్రజలు ఈ నిర్ణయంతో తీవ్ర గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ సర్వేను సాధ్యమయినంత తొందరగా ముగించాలని నిజమైన లబ్దిదారులకు వెంటనే కార్డులు మంజూరు చేయాలని సర్వే జరిపినంత కాలం రేషన్ నిలుపకుండా ఇవ్వాలని సంబంధిత అధికారులకు తక్షణమే మన కౌన్సిల్ ద్వారా ఆదేశాలివ్వాలని కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీ కాశీనాథ్ దోనేపూడి, 23వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు:-

55/907- రేషన్ కార్డుల ప్రక్రియ మధ్యలో నిలిపివేసి రూరల్ ప్రాంతాలకు ఇచ్చిన తదుపరి ఇస్తామని చెప్పి కంప్యూటర్లతొ సహా తరలించారు. ఆయా ప్రాంతాల్లో యివ్వడం పూర్తయినప్పటికీ నగరంలో ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. అర్హులైన వారికి తెల్ల కార్డులివ్వాల్సిందిగా కోరుతూ చేసుకొన్న దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి, ఆగిపోయిన మధ్యలో నిలిపివేసిన రేషన్ కార్డులను యిచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదించడమైనది.

56/908-వార్డు కమిటీలు ఏర్పడి రెండు నెలలుగావస్తోంది. సమావేశాల నిర్వహణకు కనీస ఏర్పాట్లు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సినదిగా ప్రతిపాదించడమైనది.

57/909-వార్డు కమిటీలకు రెండు లక్షల రూపాయల వరకు శాంక్షన్‌చేసి పనులు అమలు జరిపించుకొనేలా గతంలో సాంప్రదాయం ఉన్నది. ఆ పద్ధతినే కొనసాగిస్తూ తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు

58/910- 14వ డివిజన్‌లోని గీతానగర్ అడ్డకట్ట దగ్గర నుండి యనమలకుదురు కొండ వరకు నివాస గృహముల సముదాయముతో నిండి ఉన్నది. కార్పోరేషన్ వారు రోడ్లు, డ్రైన్లు, వీధి లైట్లు ఏర్పాటు చేసినారు. అన్ని సౌకర్యాలు ఉండి వరదలు వచ్చినప్పుడు తీర ప్రాంతం వరద ముంపుకు గురికాకుండ పటిష్టమైన నిర్మాణాన్ని చేపడతామని ముఖ్యమంత్రి వర్యులు వరదలు వచ్చిన సందర్భములో ఆ ప్రాంత ప్రజలకు వాగ్దానము చేసి వరద నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకొనవలసినదిగా సూచనలు ఇచ్చినప్పటికి ఆ క్రమములో పనులు మొదలుఅవ్వని కారణముగా మరల వానాకాలం వస్తుందికాన, వరదలు రావడానికి పూర్తి అవకాశం ఉన్నది. కావున వర్షా కాలము వచ్చేలోపలే పటిష్టమైన నిర్మాణము చేపట్టవలసినదిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కార్పోరేషన్ వారు ప్రతిపాదనలు పంపవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

59/911- పండిట్ నెహ్రూ బస్టాండు దగ్గర నుంచి కృష్ణలంక ప్రాంతం, బ్రమరాంభపురం మొదలు 24,23,22,16,15,14 డివిజన్ల డ్రైయినేజి నీరు మొత్తం కృష్ణానదిలో కలవడం వలన కృష్ణానది పరివాహక ప్రాంతములో నివసించే ప్రజలకు తీవ్ర దుర్గంధం మూలంగా దోమలు ఇతర కీటకాలు ప్రభలుతున్నాయి. కావున కృష్ణానది ప్రకాశం బ్యారేజి దగ్గర నుంచి వెలువడే నీరు గుంటూరు జిల్లా సరిహద్దు ద్వారా సముద్రములో 365 రోజులు (సంవత్సర మొత్తం) కలుస్తుంది. ఆ పాయలో ప్రవహించే నీటిని విజయవాడ కృష్ణలంక, కృష్ణానది ఒడ్డు నుంచి ప్రవహించేందుకు త్రోవ చేసినట్లయితే నీటి ప్రవాహ వేగముతో డ్రైయినేజి నీరు అంతా సముద్రముపాలు అవుతుంది. మరియు కృష్ణానది ఒడ్డున నీరు ప్రవహించడము వలన కృష్ణలంకలో భూగర్భ జలం సమృద్ధిగా లభ్యమై త్రాగు నీటికి కొరత ఏర్పడదు. కనుక ఇంత మంచి అవకాశమున్న ప్రతిపాదనను ఆమోదించవలసినదిగా కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి కోళ్ల సుధారాణి, 32వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు –

**60/912–32**వ డివిజన్ ఆంజనేయవాగులో కుంచం పాపులు ఇంటి నుండి కమ్యూనిటీ హాలు బెవర దుర్గారావు ఇంటి వరకు గల రోడ్డుకు ప్యాచ్ వర్క్ మరియు డ్రైన్‌లు ల్యాండింగ్‌లు, మరమ్మత్తులు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

**61/913-32**వ డివిజన్ ఆంజనేయవాగులో బొంత అనసూర్య ఇంటి నుండి కొరదల ముత్యాలు ఇంటి వరకు **20** సంవత్సరముల క్రితం నిర్మించిన మెట్లకు ఇరు వైపులా డ్రైన్‌లు, ల్యాండింగ్‌లు పూర్తిగా దెబ్బతిని శిధిలావస్థలో ఉన్నవి. కావున వాటిని తక్షణం మరమ్మత్తులు చేయించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీమతి మురపాల సత్యవతి, **58**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు:-</u>

**62/914-** 58వ డివిజన్ కొత్త రాజీవ్‌నగర్ 15వ బ్లాక్ ప్లాట్ నెం.1588 వద్ద ఉన్న తారు రోడ్డు పాడై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున వెంటనే తారు రోడ్డు ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

**63/915-**58వ డివిజన్ కొత్త రాజీవ్‌నగర్ ప్లాట్ నెం.2340 వద్ద ఉన్న సిమెంట్ రోడ్డు పూర్తిగా పాడైనది. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున వెంటనే సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీ డి.వి.రమణ బాబు, **31**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన:-</u>

**64/916-**సమాచార హక్కు చట్టం-**2005** ను విజయవాడ నగరపాలక సంస్థలో సక్రమముగా అమలు చేయాలని మొదటి కౌన్సిల్ సమావేశం అక్టోబర్ నెలలో ప్రతిపాదన పెట్టాము. ఈ ప్రతిపాదనలో ఈ చట్టం ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని అన్ని సర్కిల్ కార్యాలయాలలోను, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోను సదరు చట్టం వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని మరియు ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయుటం ద్వారా అవగాహన కల్పించాలని ప్రతిపాదన పెట్టాము. కాని తీర్మానము చేసి **4** నెలలు గడిచినా ఇంత వరకు సదరు సమాచార హక్కు చట్టం-**2005**ను అమలు చేయుటకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. అలాగే రాష్ట్ర సమచార హక్కు చట్టం కమీషనర్ గౌరవనీయులైన అంబటి సుబ్బారావు గారు విజయవాడకు విచ్చేసి కార్పొరేషన్‌లో సదరు చట్టం అమలుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

కౌన్సిల్‌లో తీర్మానము చేసినా అధికారులు ఈ చట్టం గురించి ప్రజలకు ప్రజా ప్రతినిధులకు తెలియజేసేందుకు వెనకాడుతున్నారంటే కొందరు అధికారులు చేసిన తప్పులకు సంబంధించిన నిజాలు బయటకు వస్తాయేమోనని భయం ఉన్నట్లుగా కనపడుతుంది. అందువల్ల ఈ చట్టం ప్రాధాన్యతను గుర్తించి మొదటి కౌన్సిల్‌లో చేసిన తీర్మానాన్ని అమలు జరిపేందుకు వెంటనే కమీషనర్ గారు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రతిపాదించడమైనది.

సెక్రటరీ ఇన్‌ఛార్జి,
విజయవాడ నగరపాలక సంస్థ.

అందరు వార్డు మెంబర్లకు.

నకలు:-స్థాయీ సంఘ ఛైర్‌పర్సన్ మరియు మేయరు గారికి,
,, కో-ఆప్టెడ్ మెంబర్లకు,
,, ఎక్స్-అఫిషియో మెంబర్లకు.
,, డిప్యూటీ మేయరు గారికి,
,, కమీషనరు గారికి మరియు అదనపు కమీషనరు (జనరల్) గారికి,
,, ఎగ్జామినర్ గారికి మరియు అందరు అధికారులకు,
,, అందరు సూపరింటెండెంటులకు,
,, జోనల్ మేనేజర్ గారికి, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, విజయవాడ-**10**.
,, నోటీసు బోర్డునకు.